జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 27-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 624 పేజీలు: 4 వెల: రూ.7

# ధాబాల్లో..అర్ధరాత్రి.. దందా!




- రాత్రి 11 గంటలు దాటినా మూతపడిన పలు ధాబాలు
- చిరు ధాబాలపై ఒకలా.. బడా ధాబాలపై మరోలా పోలీసుల వ్యవహారం
- నిత్యం ధాబాల వద్ద గొడవలు
- జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలు బేఖాతర్
- కొందరు పోలీసుల అండదండలు ఉన్నాయన్న అనుమానం

**శ్రీకాకుళం క్రైం, మార్చి 26 (వార్త):** జిల్లా పోలీస్ యంత్రాంగం శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి 11 గంటల తర్వాత దుకాణాలు, ధాబాలు మూసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల పక్షపాత వైఖరి వల్ల ఈ నిబంధనలు తుంగలో తొక్కుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఎచ్చెర్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటినా సాగుతున్న ధాబాల సంస్కృతి సామాన్యుల ప్రాణాల మీదకు వస్తోంది. జిల్లా ఎస్పీ తీసుకునే ఉన్నతమైన నిర్ణయాలను సైతం తమకు అనుకూలంగా మలుచుకుంటున్న సదరు 'అవతార పురుషుడు' తీరుపై సర్వత్రా చర్చ సాగుతోంది.

ధాబాల్లో వేకువజాము వరకు వ్యాపారాలు!

ఇటీవల పొన్నాడలో జరిగిన హత్యోదంతంలో నిందితులు ఒక ధాబాలో ఆహారం కొనుగోలు చేయడం గమనార్హం. కానీ ఆ సర్కిల్ పరిధిలో తనిఖీలు లేకపోవడం, అక్రమాలకు అండగా నిలుస్తున్న కొందరి వ్యవహారశైలి వల్ల ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటికీ ఇదే ధాబా అర్ధరాత్రి రెండు గంటలు దాటినా తెరిచే ఉంటుంది. గతంలో ఒక ధాబాలో జరిగిన ఘర్షణలో లారీ డ్రైవర్ యజమానిని తొక్కి చంపేసిన ఘటన, అలాగే కంచిలి పరిసరాల్లో ధాబాల్లో మద్యం సేవించి రోడ్లు దాటుతూ ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు భద్రతా లోపాలకు అద్దం పడుతున్నాయి. దాబాల్లో మద్యం సేవించడానికి అనుమతి లేకపోయినా, పర్మిట్ రూములు లేకుండానే కొన్ని ధాబాలు 'బెల్టు షాపులు'గా మారిపోతున్నాయి. కొర్రాయి గేట్ సమీపంలోని ధాబాలకు రాత్రి 11 గంటల తర్వాత సమీప గ్రామాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలి రావడం ఆందోళన కలిగిస్తోంది. అక్కడ మద్యం సేవించి బైకులపై మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే నవభారత్ జంక్షన్‌లో శరత్ ధాబాలో జరిగిన గొడవ, నగదు అపహరణ వంటి ఘటనలపై పోలీసులు అధికారికంగా స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటో ప్రజలకు అర్థం కావడం లేదు.

## ద్వంద్వ నీతి ఎందుకు?


వ్యాపారం చేసుకోవడం అందరి హక్కే అయినా, చట్టం అందరికీ సమానంగా ఉండాలి. రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్లు, నూడిల్స్ సెంటర్లు నడుపుకునే చిరు వ్యాపారులపై రాత్రి 10 గంటలకే జులుం ప్రదర్శించే పోలీసులు, అర్ధరాత్రి వరకు అక్రమ వ్యాపారాలు చేస్తున్న ధాబా యజమానులను ఎందుకు భుజాన ఎత్తుకుంటున్నారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ 'అవతార' రాజకీయం వల్ల జిల్లా పోలీసు వ్యవస్థకే చెడ్డ పేరు వస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. శ్రీకాకుళం, టెక్కలి డిఎస్పీలు పత్రికా ప్రకటనల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు ఉంటాయని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడానికి కారణం ఎవరో గుర్తించాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలను అతిక్రమిస్తున్న ధాబాలపై, వారికి వంత పాడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# 30న మూలపేట పోదాం

- టిడిపి తప్పుడు ప్రచారాలను తిప్పికొడదాం
- మూలపేట పోర్టు బహిరంగ సభ విజయవంతం చేద్దాం
- ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా మూలపేటకు వెళ్తాం
- బహిరంగ సభకు అనుమతి ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- జగనన్న ఆశయాలకు అనుగుణంగా పోర్టు పూర్తి చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తెద్దాం
- వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ పేరాడ తిలక్




**సంతబొమ్మాళి, మార్చి 26 (వార్త):** ఈనెల 30వ తేదీన మన మూలపేట పోర్టుకు పోదాం పదండి కార్యక్రమాన్ని, బహిరంగ సభను విజయవంతం చేద్దామని వైఎస్‌ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. నౌపడ మూడు రోడ్లు జంక్షన్ వద్ద గురువారం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూలపేట పోర్టును చంద్రబాబు నాయుడు ఇచ్చారని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మహానాడులో చెప్పడాన్ని ఖండించారు. ఒకవేళ చంద్రబాబు నాయుడు ఇచ్చి ఉంటే శిలా ఫలకం ఎక్కడ వేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని వైయస్సార్సీపి శ్రేణులను పిలుపునిచ్చారు. ఈ జిల్లా, ఈ ప్రాంత అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారని పరిశ్రమలు రావాలనే ఉద్దేశంతో ప్రపంచంతో అనుసంధానం చేయాలనే సంకల్పంతో మూలపేట పోర్టును తెచ్చారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడుస్తూ పోర్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి కమీషన్ల కోసం ఏజెన్సీలపై ఒత్తిడి తెచ్చి రాజకీయ వివక్షత చూపి పోర్టును నిర్మాణం పూర్తి చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత సమస్యలపై భూములు ఇచ్చిన రైతుల సమస్యలు, నిర్వాసితులకు మౌలిక వసతుల కల్పించకుండా తదితర సమస్యలపై పోరాడి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడానికి తలపెట్టిన మూలపేట పోర్టు బహిరంగ సభకు పర్మిషన్ ఇవ్వకుండా పోలీసులు ఆటంకాలు కలిగిస్తున్నారని అన్నారు. మూలపేట పోర్టు కు, బహిరంగ సభకు 8 కిలోమీటర్లు దూరం ఉన్న మంత్రి అచ్చం నాయుడు ఆదేశాలతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పోర్టు సందర్శనకు, బహిరంగ సభకు పర్మిషన్ ఇవ్వకపోతే కోర్టుకు వెళ్తామని అన్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, టెక్కలి ఆర్డిఓ, విజిలెన్స్ ఎస్పి తదితరులను తమ సామాజిక వర్గానికి చెందిన వారిని మంత్రి అచ్చం నాయుడు నియమించుకుని దాడులు చేసి కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. అనుమతులు ఇవ్వకుండా చేసి మూలపేట పోర్టు బహిరంగ సభ వాయిదా వేసుకోవాలని పోలీసులు చూస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా పడదని అవసరమైతే ఇక్కడే నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. అనుమతులు ఇవ్వకుండా ఇంకా ఆటంకాలు కలిగిస్తే వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మూలపేట పోర్టుకు రావాల్సి వస్తుందని అన్నారు. టెక్కలి నుండి మూలపేట పోర్ట్ వరకు రోడ్డుకు కిలో మీటర్ వరకు జిరాయతి భూములను ప్రభుత్వం తీసుకుంటుందని మీ అనుకూల పత్రికల్లో కథనాలు వచ్చాయని అన్నారు. ఈ కథనాలపై ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్డీవో కూడా ఖండించలేదని అన్నారు. ఈనెల 30న జరిగే బహిరంగ సభను విజయవంతంగా చేయడానికి గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చల్లా రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బి మోహన్ రెడ్డి, నౌపడ సర్పంచ్ పి .రవి కుమార్ రెడ్డి, మూలపేట సర్పంచ్ జీరు బాబురావు, నక్క భీమారావు, కోత సతీష్, బి. సుధాకర్, మార్పు నాగభూషణరావు, జోగి రాములమ్మ, సురాడ వెంకటేష్, వాడరేవు రవికుమార్, జీరు శివ, చిన్ని జోగారావు తదితరులు ఉన్నారు.



## బోటు బోల్తా

- కొట్టుకు పోయిన వలలు
- ఆదుకోవాలని కోరుతున్న మత్స్యకారులు

**సోంపేట మార్చి 26(వార్త):** ఎకువూరు గ్రామం వద్ద సముద్రంలో లంగర్ వేసిన బోటు భారీ ఈదురుగాలులకు సముద్రంలో బోల్తా పడింది. బోటులో ఉన్న లక్షల రూపాయల విలు వైన వలలు సముద్రంలో కొట్టుకుపోయాయి. నాలుగు గ్రామాలకు చెందిన మత్స్యకారులు గురువారం ఉదయం నుంచి శ్రమించి సము ద్రంలో బోల్తా పడిన బోటును ఒడ్డుకు చేర్చారు. బోటు కూడా ధ్వంసం కావడంతో నష్టం జరిగిం దని బాధితులకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



# పడాల లక్ష్మణరావు గార్కి జన్మదిన శుభాకాంక్షలు






Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అవలింగి చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం



**సారవకోట, మార్చి 26 (వార్త):** అవలింగి గ్రామంలో ముద్దాడ గౌరి నాయుడు ఇంట్లో సోమవారం జరిగిన చోరీ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. నరసన్నపేట సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సారవకోట, జలు మూరు మండలాల పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. మొదట కుటుంబసభ్యులను విచారించి, చోరీ జరిగిన సమయంలో ఇంట్లో ఎవరెవరున్నారు,

అనుమానితులు ఎవరు అనే అంశాలపై ప్రశ్నించారు. ఈ ఘటనలో 23 తులాల బంగారం, రూ.1.5 లక్షల నగదు అపహరణకు గురైన విషయం తెలిసిందే. పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

# ఇంటింటా రామాయణం

**-మహాకావ్యంతో పెన వేసుకున్న బంధాలెన్నో..**

**-రాములోరి కల్యాణాలకు**

**ఇళ్లూ.. వాకిళ్లూ.. ఊరూ..వాడా.. సిద్ధం**

**-నేడు శ్రీరామనవమి వేడుకలు**

**పలాస, మార్చి 26 (వార్త):** రామాయణం.. మనిషి ఎలా జీవించాలో తెలిపే ధర్మశాస్త్రమని పెద్దలు చెప్పే మాట. ప్రతి హిందువు జీవితం రామాయణంలోని ఏదో ఒక ఘట్టంతో ముడిపడి ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ పరమ సాధన కావ్యంలో పలు విషయాలను నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో మనకు తెలియకుండానే వినియోగిస్తుంటాం. హనుమంతుడి ముందా కుప్పి గంతులు.. ఆకలి అయినప్పుడు అన్నమో రామచంద్ర.. బాధను వ్యక్తపరిచే సందర్భంలో ఆలో లక్ష్మణా అని.. అన్నదమ్ముల్లా ఉంటే 'రామలక్ష్మణుల్లా ఉన్నారని.. ఓర్వలేని వారని'.. చూస్తే చుప్ప నాతి శూర్పణఖ అని.. ఇంటిగుట్టు లంకకు చేటని.. కట్టె.. కొట్టే.. తెచ్చే..అని.. రామాయణంలో పిడకల వేట అని.. మహిళలకు కష్టాలు వస్తే సీతమ్మ కష్టాలని.. చూసి రమ్మంటే కాల్చి వచ్చాడని.. రామాయణమంతా విన్నాక రాముడికి సీత ఏమవుతుందని అడిగినట్లు.. రామరాజ్యం.. రావణ కాష్టం .. తదితర పదాలు నిత్యజీవితంలో భాగమయ్యాయని పండితులు చెబుతారు. దీన్నిబట్టి రామాయణం మన జీవితంలో ఎంతగా పెన వేసుకొని పోయిందో అర్థమవుతుందనని పెద్దలు చెప్తుంటారు. విడదీయలేని బంధం.. ఆధ్యాత్మికంగానే గాకుండా అన్ని విధాలుగా శ్రీరాముడు మార్గదర్శంగా నిలుస్తాడన్నది పెద్దలు చెప్పే మాట. ఏకపత్నీవ్రతుడుగా ఉన్న అయోధ్య రాముడు ఆలయం లేని ఊరు ఉండదంటే అతిశయోక్తి కాదు. ఒక సారి రామ.. హరేరామ అంటే ఎంతో పుణ్యం వస్తుందన్నది రామ భక్తుల నమ్మకం. అందుకే చాలామంది పనిపాటల్లో శ్రీరామచంద్రుని తలచుకుంటూ ఉంటారు. అన్నదమ్ముల మధ్య అనుబంధానికి.. స్వామి భక్తి పరాయత్‌కు, భర్తపై భార్యకు ఉన్న ప్రేమ, గౌరవానికి, తండ్రి పై కుమారుడికి ఉన్న గౌరవం, భక్తి భావానికి రామాయణం నిలుస్తున్నది భక్తుల విశ్వాసం.



### ముస్తాబైన రామాలయాలు

రాములోరి కల్యాణానికి గ్రామాలు ముస్తాబు అవుతున్నాయి. గ్రామాల్లో వాడ వాడలా ఉన్న సీతారాముని ఆలయాల వద్ద ఉత్సవ కమిటీలు శ్రీరామనవమి వేడుకలు ఏర్పాటు చేస్తున్నాయి. రామయ్య కళ్యాణాన్ని ప్రతి కుటుంబం తమ ఇంట్లో కల్యాణంగా భావించడం అనాదిగా వస్తున్నదే. గ్రామం, పట్నాలలో జరిగే కల్యాణంలో ప్రతి తంతును వేద పండితులు తాత్పర్య సహితంగా వివరిస్తూ నిర్వహిస్తుంటే భక్తులంతా తమ ఇంటిలో జరుగుతున్న తంతుగా పొంగిపోవడం అందరికీ అనుభవమే. ఇంటిల్లిపాదీ రామాలయానికి చేరుకొని దగ్గరుండి కల్యాణంలో పాలుపంచుకొని తరిస్తుంటారు. ప్రతి గ్రామంలో.. కొన్ని గ్రామాల్లో వీధి వీధినా రామాలయాలు ఉంటాయి. ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా సీతారాముని కల్యాణం వేడుకలు నిర్వహించనున్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్



**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరగనున్న బయాలజీ పరీక్షకు సిద్ధం చేసేందుకు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం బమ్మిడి శ్రీను తెలిపారు. గురువారం ఉదయం పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులకు రేపటి బయాలజీ పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలపై తగిన తర్ఫీదు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. సాయంత్రం వరకు స్టడీ అవర్స్ కొనసాగుతాయని తెలిపారు.

## విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి




**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** విద్యార్థుల్లో మరింత సామర్థ్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచించారు. గురువారం నరసన్నపేట మండలం నర్సింగరాయుడుపేట ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థులతో మమేకమై వారి విద్యా స్థాయిని పరిశీలించారు. పలు అంశాలపై విద్యార్థులను నేరుగా ప్రశ్నించి వారి అవగాహనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన విద్యాబోధన అందించే దిశగా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## దేశవానిపేటలో ..

## శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం

**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని దేశవానిపేటలో ఉన్న శ్రీ కోదండరామ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. జడ్పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు ఆధ్వర్యంలో ఆలయం వద్ద పందిరి రాట (శుభరాట) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపు కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శనివారం పట్టాభిషేకంతో పాటు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రీరామ పట్టాభిషేకం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



## గ్యాస్ కొరత తీర్చకపోతే హోటళ్ల సామూహిక బంద్



**ఇచ్ఛాపురం, మార్చి 26(వార్త):** గ్యాస్ కొరతతో చిన్నా..పెద్దా హోటల్స్ యజమానులు రోడ్డున పడ్డామని, గ్యాస్ కొరత తీర్చి ఆదుకోవాలని స్వేచ్ఛావతి హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పన గవరయ్య డిమాండ్ చేశారు. గ్యాస్ సమస్య తీరక పోతే సామూహికంగా హోటళ్లు బంద్ చేయడమే శరణ్యమన్నారు. గురువారం స్థానిక భవానీ రెస్టారెంట్లో వారు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సుమారు చిన్న, పెద్ద హోటల్స్ 200 వరకు ఉన్నాయని, ఈ హోటల్స్‌పై సుమారు 2వేలు కుంటుంబాలు ఆధారపడి ఉన్నాయని, గ్యాస్ కొరతతో ఇప్పటికే 50హోటల్స్ వరకు మూతపడ్డాయని తెలిపారు. హోటల్స్ మూతబడితే ఎంతోమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. కమర్షియల్ గ్యాస్ కోసం గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి అడిగితే స్టాక్ లేదంటున్నారని వాపోయారు. హోటల్స్ మూతబడితే వందలాది కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్స్ పైనే రోజువారీ కూలీలు, రోగులు, ఉద్యోగులు ఆధారపడి ఉన్నారని తెలిపారు. గ్యాస్ లేకపోవటంతో వ్యాపారాలు సాగక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. హోటళ్లతో పాటు టీ షాపుల యజమానులు కూడా ఇబ్బందులు పడి షాపులు మూసివేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ సెక్రటరీ గౌరవాధ్యక్షుడు ఉప్పాడ తులసయ్య రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుడియా బబులాసాహు, పట్టణ ఉపాధ్యక్షుడు సాలిన శంకర్, సెక్రటరీ గుడియా హేమ సాహు, కోశాధికారి ఆనంద్, కటకం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** నరసన్నపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చెన్నాయుడు సేవలు, నాయకత్వ పటిమను, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను ప్రశంసించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అచ్చెన్నాయుడు దీర్ఘాయుష్షుతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి సమావేశంలఅనుబంధ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా వసంత నవరాత్రి దుర్గా పూజలు

**-52 ప్రసాదాలతో అమ్మవారి చండీ హోమం**



**పలాస, మార్చి 26 (వార్త):** కాశీబుగ్గ ఎల్ సి గేటు వద్ద నెలకొన్న శ్రీ పంచముఖ ఆంజనేయ ఆలయంలో వసంత మాస దుర్గా నవీన్ పూజలో భాగంగా దుర్గాదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం అష్టమి సందర్భంగా చండీ హోమం చేపట్టి అమ్మవారికి 52 ప్రసాదాలతో ప్రత్యేక నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం సప్తశతి పారాయణం, రామాయణ కావ్య గాధన్ వినిపించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బుద్ధిరాం పంతులు రాజేష్ పాల్గొన్నారు. శ్రీరామనవమితో తొమ్మిది రోజులు దుర్గామాతలు పూజలు ముగిస్తాయని అర్చకులు తెలిపారు.

## బాధితురాలికి సీఎం సహాయ నిధి అందజేత



**కంచిలి, మార్చి 26(వార్త):** కుత్తమ గ్రామం బలగ మణి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పేద మహిళ కావడంతో టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు సీఎం సహాయ నిధి నుంచి సహాయం ఇప్పించాలని ఎమ్ఎల్ఏ బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు ఆమెకు రూ.85,000లు మంజూరు కావడంతో గురువారం ఆ చెక్కును ఎమ్ఎల్ఏ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రామారావుకు, అశోక్‌కు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## గిరిజనులపై మాటల దాడిని ఖండిస్తున్నాం

**మందస, మార్చి 26(వార్త):** గిరిజనులపై మాటల దాడిని ఖండిస్తున్నామని ఆదివాసీ వికాస్ పరిషత్ సంఘం అధ్యక్షుడు సవర జగన్ అన్నారు. జిల్లాలో బెంతు ఒరియాలులేరని, ఆ విషయమై స్థానిక ఇచ్ఛాపురం శాసన సభ్యులు అశోక్ కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే, మాట్లాడే క్రమంలో ఓ ఆదివాసీ అడిగిన ప్రశ్నకు ఎంఎల్ఏ కోపంతో గిరిజనులను ఉద్దేశించి బాస్టర్డ్ అంటూ బూతు మాటలతో హెచ్చరించి బయపెట్టడాన్ని ఆదివాసీ వికాస పరిషత్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా, రాష్ట్ర నాయకులతో మమేకమై ముందుకు వెళ్తామని తెలిపారు.

## బీవీకే హైస్కూల్ వద్ద చలివేంద్రం ఏర్పాటు




**సారవకోట, మార్చి 26 (వార్త):** సవరఅడ్డపనసలో ఉన్న బీవీకే హైస్కూల్ వద్ద గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో విద్యార్థులతో పాటు ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే ప్రజలకు దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వి. పున్నయ్య, పోలీస్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## లుకలాంలో బడిబాట - అడ్మిషన్ డ్రైవ్



**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** లుకలాంలో గురువారం బడిబాటతో పాటు ఇంటింటా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. యం.ఈ.ఓ పేడాడ దాలినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ కార్మికుల వద్దకు చేరుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "మన గ్రామ బడి నీ కాపాడుకుందాం" పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఒప్పించారు. మండల విద్యాశాఖ అధికారులు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామ పాఠశాలలను సంరక్షించుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఉద్యోగాల పేరుతో మోసం.. ముగ్గురికి 18 నెలల జైలు శిక్ష, జరిమానా!

**పలాస, మార్చి 26 (వార్త):** ఉద్యోగాల పేరుతో మోసం చేసిన కేసులో విశాఖపట్నం గోపాలపట్నం చెందిన వాండ్రాశి సన్యాసిరావు, ఎన్ఏడీ కొత్త రోడ్డుకు చెందిన రావాడ నాగేశ్వరరావు, పాత గాజువాక చెందిన కలుపూరి ఆదినారాయణ, పెదగంట్యాడకు చెందిన ముంజేటి శ్రీనుకు 18 నెలల జైలు శిక్ష, రూ.4500లు జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాదిరి గురువారం తీర్పును వెల్లడించారని కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. 2014 జూన్ ఆరో తారీఖున పలాస టౌన్ ఉదయపురంనకు చెందిన రాజాన కూర్మారావుకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, నకిలీ పత్రాలు సృష్టించి రూ.ఆరు లక్షలు, పలాస పరిసర గ్రామాలకు చెందిన 11 మంది వద్ద రూ.ఆరు లక్షలు తీసుకొని మోసం చేశారన్నారు. ఈ ఫిర్యాదుపై అప్పటి సీఐ వై.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో తుది తీర్పు ఇచ్చారని వెల్లడించారు.



# 30న మన మూలపేట పోర్టుకు..

# పోదాం పదండి



**ఇచ్ఛాపురం, మార్చి 26(వార్త):** ఈనెల 30న చేపట్టే మన మూలపేట పోర్టుకు పోదాం పదండి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఇచ్ఛాపురంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై, మాట్లాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 2023లో రూ.4361 కోట్లతో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల మధ్య పోర్టును 1,010 ఎకరాల్లో ప్రారంభించి, 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పనులు చేసినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్లక్ష్యం చేసిందన్నారు. జిల్లాకు మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఉన్న పోర్టు పనులు పూర్తిచేయలేక పోవడం జిల్లా ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. దీనికి నిరసనగా ..ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికి, జిల్లా ప్రజలకు చైతన్య పరచడానికి ఈ కార్యక్రమం చేపడు తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, క్రిస్టియన్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, నియోజకవర్గ యువ జన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ కారింగి మోహనరావు, పిలక సంతు, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు సాలిన గాంధీ, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, లోపింటి దీనబంధు, పార్టీ జిల్లా ప్రతినిధులు ఆశి పురుషోత్తం, ఇసురు పరశురాం, సీనియర్ నాయకులు ఆశి కృష్ణారెడ్డి, బాకి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు సప్ప వంశీ, సాడి జయరాం రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన



**సారవకోట, మార్చి 26 (వార్త):** టెక్కలి డివిజన్ శక్తి టీంకి చెందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం. గిరిధర్, కే. గణేష్ ఆధ్వర్యంలో గురువారం సారవకోట మండలం సవరఅడ్డపనస గ్రామంలోని బీవీకే హైస్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు, సమాజం కలిసి కృషి చేయాలని సూచించారు. పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను కూడా తెలియజేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు రమణమ్మ, హెచ్ఎం పున్నయ్య పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఉత్సవాలకు అంకురార్పణ



**సోంపేట, మార్చి 26(వార్త):** సోంపేటలోని చిన్న కోమటివీధి లో వెలసిన శ్రీ కోదండరామ ఆలయంలో గురువారం సాయంత్రం శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. ఆలయ అర్చకులు పీవీ రమణచార్యులు, పవన్ కుమార్ శాస్త్రోక్తంగా స్వామి వారికి విశేష పూజ కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ ఉత్సవాలు అంకురార్పణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయం ఆవరణలో ట్రస్ట్ కమిటీ చైర్మన్ ఏర్పాటు చేసిన రాముని అవతారలకు సంబందించిన చిత్రాలను భక్తితో పరిశీలించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చైర్మన్ బీన ఆనందరావు, ఈఓ రామారావు దున్న ప్రకాష్, మల్లా షణ్ముఖ రావు, చిత్రాడ శేఖర్ వడ్డి శివ శంకర్, బెల్లాన శ్రీకాంత్, కాంచన రాఘవదాస్, దున్న జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## రావిపాడు మోడల్ పాఠశాల తనిఖీ



**జలుమూరు, మార్చి 26 (వార్త):** రావిపాడు ప్రభుత్వ మోడల్ పాఠశాలను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవిఎస్ఆర్ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న వారు ముందుగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, విద్యా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అవగాహన కూడా కల్పించారు. ఈ సందర్భంగా జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు విధానం గురించి ఉపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ నాణ్యతను కూడా పరిశీలించారు. తదనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధిపై చర్చించారు.

## సజావుగా మున్సిపల్ ఆశీళ్ల వేలం పాటలు



**ఇచ్ఛాపురం, మార్చి 26 (వార్త):** పలు మార్లు వాయిదా లు పడుతూ చివరకు కౌన్సిల్ రద్దు చేసిన మున్సిపల్ వీధి గుత్త బజారు గుత్త ఆశీళ్ళ వేలం పాటలు గురువారం మరో మారు జరిగాయి. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబందించి మున్సిపల్ ఆశీళ్ళవేలం పాటలు మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ఎన్ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో మార్కెట్, వీదిగుత్త, కమేళా తదితర అంశాలల్లో ఆశీళ్ళ వేలం పాటలు జరిగాయి. వేలం పాటలు పోటా–పోటీగా జరిగాయి. దినవారి మార్కెట్ ఆశీల పాట కొయ్యి పార్వతి రూ38.34 లక్షలకు పాడగా జీఎస్ టీ రూ6,90,120తో కలిపి రూ48లక్షల 10వేల 120 సొంతం చేసుకున్నారు. కమేళా కాళ్ల మోహన రావు రూ3లక్షల 10వేలుకు పాడగా రూ55800జీఎస్టితో కలిపి రూ3లక్షల 65వేల800కి సొంతం చేసుకున్నారు. కొబ్బరి చెట్లు పలసాయం రూ 4050కి కాళ్ల మోహన రావు పాడగా జీఎస్టి రూ729కలిపి రూ4779కి సొంతం చేసుకున్నారు. లైబ్రరీ పేపర్లు కాళ్ల మోహనరావు రూ5850కి పాడగా జీఎస్ట1053తో కలిపి రూ6903కి సొంతం చేసుకున్నారు. ఈ పాటలను స్పెషల్ ఆఫీసర్ ఆమోదం పొందాల్చి ఉంది.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

**ఇచ్ఛాపురం మార్చి 26 (వార్త):** మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు హెచ్చరించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేస్తామని, ఫైన్‌లు విధిస్తామని హెచ్చరించారు.



# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



### మందసలో స్వచ్ఛరథం ప్రారంభించిన ఎంఎల్ఏ గౌతు శిరీష

**మందస, మార్చి 26(వార్త):** ప్రజా ఆరోగ్యానికి స్వచ్ఛతే కీలకమని పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష అన్నారు. స్వచ్ఛ సంకల్పమే ధ్యేయంగా మందస ఎంపిడిఓ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమశీలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛాంధ్ర వాహనాన్ని ప్రారంభించారు. స్వచ్ఛ సంకల్పమే ప్రభుత్వ ధ్యేయం స్వచ్ఛరదాన్ని ప్రారంభిస్తూ ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతే రాష్ట్రాభివృద్ధికి పునాది అని, ప్రతీ గ్రామం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమని ఆమె పేర్కొన్నారు. గ్రామ స్వచ్ఛత – మనందరి బాధ్యతని, ఇంటింటికీ చెత్త సేకరణకు ప్రత్యేక వాహనం ఉందని, ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన గ్రామాల నిర్మాణం అనే నినాదంతో ముందుకు పోవాలని కోరారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా హరిపురం సచివాలయం, బుడార్సింగి సచివాలయాల సంబంధించి స్వచ్ఛ రథాలను కూడా ప్రారంభించారు. అన్ని సంపదలకల్లా గొప్పది ఆరోగ్యమేనని, ప్రతి కుటుంబానికి ఆరోగ్యాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో వైద్య సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా ప్రజలలో ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ స్వచ్ఛ రథాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు గౌతు శిరీషతో పాటు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, మందస మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భావన దుర్యోధన, సాలిన మాధవరావు, మందస, బాలిగాం పిఏసిస్ అధ్యక్షులు తమిరి భాస్కరావు, లబ్బ రుద్రయ్య, లచ్చయ్య, డొంకురు తిరుపతి, రాజన మహేశ్, గార కృష్ణారావు, రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, చౌదరి మురళి, దేవరశెట్టి మార్కండేయులు, మెట్ట మహేష్, జనసేన సంతోష్ పండా, పలాస మండల నాయకులు తమ్మినేని గంగారాం, కోరికనా శంకరావు, ఎంపీడీఓ సిబ్బంది, వెలుగు సిబ్బంది, తెలుగుదేశం ఇతర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన చట్టాలతో మహిళలకు మరింత రక్షణ



**మందస, మార్చి 26(వార్త):** ప్రభుత్వాలు మహిళల రక్షణకు మరిన్ని చట్టాలను తీసుకువచ్చిందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల శాతవాహన కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి యాప్ ఉపయోగాలు, మహిళా భద్రత, మహిళలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాల నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నారీ శక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది, శాతవాహన కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తూరులో అట్టహాసంగా మంత్రి అచ్చెన్న జన్మదిన వేడుకలు

**కొత్తూరు, మార్చి 26 (వార్త):** కొత్తూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఆగతముడి మాధవరావు మాట్లాడుతూ.. అచ్చెన్నాయుడు జిల్లా అభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మాతల గాంధీ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అగతమూడి అరుణ్‌కుమార్, కర్లమ్మ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్దాస్ నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి ఆరుబోలు దశరథరావు, ఆకుల తంపర సర్పంచ్ నాగల అప్పన్న , సీనియర్ నాయకులు కులశేఖర్ అల్వార్, దాస్ నాయుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చింతాడ కోటేశ్వరరావు, చోడవరపు రాము, చోడవరపు లోకేశ్వరరావు, ముగితి కృష్ణ తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.





## వాట్సాప్ గ్రూప్‌లో దూషణలపై పోలీసులకు ఫిర్యాదు



**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** నరసన్నపేటలోని వాట్సాప్ ప్రెస్ గ్రూప్‌లో వ్యక్తిగత దూషణలకు గురైనట్లు తెలుగుదేశం పార్టీ నాయకుడు జామి వెంకట్రావు ఆరోపించారు. ఈ ఘటనపై ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్న జామి వెంకట్రావు మాట్లాడుతూ, తమ పార్టీకి సంబంధించిన అధికారిక యాప్ ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే గ్రూప్‌లో పంచుకుంటామని, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదని స్పష్టం చేశారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జి. ప్రసాద్ అనే వ్యక్తి తనపై వ్యక్తిగతంగా దూషణలు చేసి మానసికంగా బాధ కలిగించాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలు గమనించి ఆవేదన వ్యక్తం చేయడంతో, వారి సహకారంతో అన్ని ఆధారాలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. రాజకీయ స్వార్థంతో కొందరు తనపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించిన ఆయన, ఇలాంటి చర్యలకు పార్టీ తరఫున తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## లుకలాం పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** లుకలాం ఉన్నత పాఠశాలను ఎంఈఓ పేడాడ దాల్ నాయుడు గురువారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల లెర్నింగ్ స్థాయిని పరిశీలించి, వారి విద్యా ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో బోధన నాణ్యతను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజనం రుచికరంగా, నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు మరియు హెడ్‌మాస్టర్ భోజనాన్ని రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.య.టి శ్రీను పాల్గొన్నారు.

## శ్రీముఖలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1.91 లక్షలు

**జలుమూరు, మార్చి 26 (వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో కొలువు అయి ఉన్నా శ్రీముఖలింగేశ్వర స్వామి వారి దేవాలయ హుండీ ఆదాయం రూ.1,91,175లు వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏడుకొండలు తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో, గత 34 రోజుల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలు, దర్శనాలు, టికెట్ల విక్రయాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు, పోలీస్ శాఖ అధికారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపునకు సహాయ కమిషనరు వారి ఆదేశాలు ప్రకారము శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం, రావివలస కార్యనిర్వహణాధికారి జి. గురునాధ రావు పర్యవేక్షణకు హాజరయ్యారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి



**ఇచ్ఛాపురం మార్చి 26 (వార్త):** మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని గ్రామాలైన బుడ్డెపుపేట, లక్ష్మీపురం, మండపల్లి, దేవులమద్దిలిలో ప్రధానోపాధ్యాయులు తంగి విజయానంద భార్గవి ఆధ్వర్యంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లితండ్రులకు తెలియపరచి తమ తమ పిల్లలను తమ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండపల్లి లో చేర్పించవలసినదిగా తల్లితండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాలిహుండం వాసంతి, అమూల్య, రీనా, ఇప్పిలి లలితా, ఉమ శంకర్, కవిరాజు, మురళి, గణపతి, శ్రీనివాస్, వెంకటేష్, లలితా కుమారి, నాగమణి, జయవాణీ, తదితరులు పాల్గొన్నారు.

# పలాస నెహ్రూ పార్కు వద్ద దుకాణాల తొలగింపు

**-జాతీయ వార్త కథనానికి స్పందన**

**-వాకర్స్ సభ్యులు, పాదాచారులు హర్షం**

**పలాస, మార్చి 26 (వార్త):** పలాస కాశీబుగ్గ కేటీ రోడ్లో నిత్యం బిజీగా ఉంటూ జంట పట్టణాల ప్రజలకు ఎంతో ఆహ్లాదం కలిగిస్తున్న నెహ్రూ పార్కు ముత్యాలమ్మ కోనేరు చుట్టూ ఉన్న దుకాణాలు తొలగింపపై వాకర్స్ క్లబ్ సభ్యులు, పాదాచారులు, పార్కు సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







ఎంతో బిజీగా ఉన్న టైంలో పార్క్ వచ్చేందుకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తీరడంతో" జాతీయ వార్తకు " ధన్యవాదాలు తెలుపుతున్నారు. నిమిత్తం ఆటంకశీగా కలిగిస్తున్న దుకాణాలను గురువారం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులు తొలగించారు. పార్కు ఆవరణ చుట్టూ పార్కు పరిసరాల్లో ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండరాదని అదే విధంగా పార్కుకు వచ్చే ప్రజల వాహనాలకు అవకాశం కల్పించే దిశగాఆవరణను పరిసరాలలో ఇబ్బంది కలుగుకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల పలువురు హర్షము వ్యక్తము చేశారు. ఇప్పటికే పార్కు అభివృద్ధికై ఎమ్మెల్యే గౌతు శిరీష పురపాలక సంఘము, పలువురు, వాకర్స్ క్లబ్ సభ్యులు, పార్కు అభివృద్ధి దిశగా కృషి చేసిన గతం కన్నా ఈ పార్కు ఎంతో ప్రాముఖ్యత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు దీనిపై మరింత శ్రద్ధ చూపడంతో పార్కు పలువురి ప్రశంసలను అందుకుంటుంది. పార్కు వద్ద మిగతా దుకాణాలను కూడా తొలగించేస్తే పార్కు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ కి ఎటువంటి అంతరాయం కలగకుండా వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా 'అగ్గున్న' జన్మదిన వేడుకలు



**మందస, మార్చి 26(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు జన్మదిన వేడుకలు మందస పట్టణంలోని ఘనంగా జరిగాయి. మందస మండలంలోని బెల్లుపటియా గ్రామానికి చెందిన సూర్యారావుకు పార్టీలో మంచి నాయకునిగా గుర్తింపు ఉంది. అంచెలంచెలుగా ఎదుగుతున్న సూర్యారావు జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు హాజరయ్యారు. వైకాపా యువత కేరింతలు, ఆనందోత్సహాల మధ్య హేపీ బర్త్డే సూరన్న అంటూ సూర్యారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసిన అనంతరం ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. అందరికీ కేక్ ను పంచి పెట్టారు. పార్టీలో మరింత అభివృద్ధి చెందాలని పలువురు ఆయనను ఆశీర్వదించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కూడా సూర్యారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, పార్టీ మందస అధ్యక్షుడు సిందిరి జగన్, మందస ఎంపీటీసీ కంచి బెహరా, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



**ఇచ్ఛాపురం మార్చి 26 (వార్త):** భారత ఎన్నికల కమీషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏప్రిల్ 1వ తేదీనుంచి ప్రారంభిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా వుండాలని వైసిపి నియోజకవర్గం కన్వీనర్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. ఇచ్ఛాపురం మండలం, పట్టణంలో ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి ఒక్కో బిఎల్ఏ బూత్ లెవెల్ ఏజెంట్ లను నియమించడమైనదని, ఈ బిఎల్ఏ లు ప్రతి పోలింగ్ స్టేషన్ కు ఎన్నికల కమీషన్ ఒక్కో బిఎల్ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్) ను నియమిస్తుందని బిఎల్ఓ లకు మన బిఎల్ఏ లు అనుసరించాలని, సమగ్రమైన ఓటర్ల జాబితా తయారీలో మన పార్టీ నుంచి సహకారమందించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటర్ జాబితాలో నమోదయ్యే విదంగా బిఎల్ఏ బాధ్యత వహించాలని కోరారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులకు సమాచారం అందించాలి

**-ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి**





**పలాస, మార్చి 26 (వార్త):** ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులకు సమాచారం అందించా లని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి తెలిపారు. గురువారం చిన్న గురుదాసుపురం గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. పలాస మండలంలోని గురుదాసుపురం సందర్శించి, గ్రామ జంక్షన్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## శాంతినికేతన్ స్కూల్లో ముందస్తు శ్రీరామ నవమి వేడుకలు

**ఇచ్ఛాపురం మార్చి 26 (వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ స్కూల్ లో చైర్మన్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత న ముందస్తు శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ ఇందిరా రెడ్డి,స్కూల్ మేనేజర్ కె. సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శ్రీధర్, రవి, శాంతి, యశోద, స్నేహ, జయలక్ష్మి, మీనా, పార్వతి, ప్రమీల,శిరీష, సరోజ, ప్రియ దర్శిని ఇంటరక్ట్ క్లబ్ సెక్రటరీ డి. హర్ష వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.





## 18 మంది పద్మావతి విద్యార్థులకు..

# టాటా పింక్ క్యాపిటల్ స్కాలర్‌షిప్



**నరసన్నపేట, మార్చి 26 (వార్త):** నరసన్నపేటలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో చదువుతున్న 18 మంది విద్యార్థులకు టాటా పింక్ క్యాపిటల్ స్కాలర్షిప్ మంజూరైనట్లు కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.18,000 చొప్పున మూడేళ్లపాటు ఈ ఉపకార వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి నట్లు వివరించారు.

ఈ స్కాలర్షిప్ ద్వారా విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



**మందస, మార్చి 26(వార్త):** మందస మండలంలోనే ఐటీడీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. మందస మండల పరిధిలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర గిరజన సంక్షేమ అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ)ను ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ల నుండి గిరిజనులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని, జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. మందస మండలంలో గిరిజనుల భూ సమస్యల పరిష్కరించాలని, శ్రీకాకుళం జిల్లా గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని, ఐ.టి.డి.ఎ.ను ఏర్పాటు చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం ఐ.టి.డి.ఎ.కు నిధులు కేటాయిస్తూ గిరిజన గ్రామాలలో ఆయకట్టు ఉన్నప్పటికీ గిరిజన రైతులకు ఒక్క సెంటునకు కూడా నీరు అందడంలేదన్నారు. రిజర్వయర్ల నుండి గిరిజన గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించి, వ్యవసాయానికి చేయుతనివ్వాలన్నారు. జీడి రైతులకు పంటలను ఆర్.ఎస్.కె. ద్వారా కొనుగోలు చేయాలని, జీడి కొనుగోలు బోర్డును, గిరిజన కార్పోరేషన్ మందసలో ఏర్పాటు చేయాలని, మందస, పలాస మండలంలో గిరిజనుల భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. మందస, పలాస మండల గిరిజనుల తరుపున గిరిజన శక్తి సంక్షేమ సంఘం ద్వారా మిక్కిలి వినయపూర్వకంగా కోరుతున్నామని, వీటి కాపీలను జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం, ప్రాజెక్టు ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. సీతంపేట, రెవెన్యూ డివిజనల్ అధికారి, పలాసలకు తగు చర్యలు నిమిత్తం సమర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నర్సింహరావు, కార్యదర్శి సవర హరిక్రిష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి కోనేరు రమేష్, సంఘం నాయకులు ఈశ్వరరావు, భీమన్న, ధర్మరాజు, గోపాల్, మోహన్, భీమన్న, చిన్న, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## మూలపేట పోర్టు పనులపై కూటమి నిర్లక్ష్యం

**కంచిలి, మార్చి 26(వార్త):** టెక్కలి నియోజకవర్గం మూలపేట వద్ద గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2023 లో పనులు ప్రారంభించిన మూలపేట పోర్టు పట్ల ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు దుంపల లక్ష్మణరావు, నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. ఈ మండలం జక్కర గ్రామం వద్ద గురువారం ఎమ్ ఎల్ సి నర్తు రామారావు, పార్టీ బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలతో మూలపేటకు పోదాం పదండి కార్యక్రమం పై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా వెనుకబడినటువంటి ఈ ప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడే ఇటువంటి పోర్టు నిర్మాణాన్ని 2025 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో 2026 దాటిన పనులు చేపట్టకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేసేలా ఈ నెల 30న మూలపేట పోర్టుకు పోదాం పదండి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు హాజరు కానున్నాయని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, వజ్జ మృత్యుంజయం, సల్ల దేవరాజు, నర్తు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బంది లేకుండా భూ సమీకరణ చేయండి

**- రైల్వే అధికారులు, ఆర్డీవోకు**

**పాలవలస రైతుల విజ్ఞప్తి**



**సోంపేట మార్చి 26(వార్త):** పాలవలస గ్రామం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ విషయమై రెవెన్యూ, రైల్వే అధికారులతో కూడిన బృందం గురువారం పాలవలస గ్రామంలో రైతులతో సమావేశమై చర్చించారు. పలాస ఆర్డీవో స్థానిక తాసిల్దార్ పలువురు రైల్వే అధికారులు కలిసి కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తో పాటు గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ చేపట్టిందని గుర్తు చేశారు. దానివల్ల ఇప్పటికే రైతులు భూములు కోల్పోయి వలస పోవాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం రైల్వే అధికారులు చేపట్టే నిర్మాణం మంచిది అయినప్పటికీ అవసరమైన భూమి విషయంలో రైతులకు అధిక నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలతో భూసేకరణ చేయాలని కోరారు. గ్రామస్తులు వ్యవసాయ భూములు, స్మశాన వాటిక, గ్రామ దేవత ఆలయానికి వెళ్లే రహదారులకు ఇబ్బంది లేకుండా రైల్వే లైన్ పై అండర్ పాసేజ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామస్తుల ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా ప్రతిపాదనలు మంజూ రయ్యేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోంపేట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సిరిపురం జన్మదిన వేడుకలు

**ఎల్ఎన్ పేట/ హిరమండలం, మార్చి 26(వార్త):** జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం పాతపట్నం కె ఎస్ ఎం కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ సమక్షంలో కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తేజేశ్వరరావు 13 ఏళ్ల నుంచి నియోజక వర్గ సమస్యలపై పోరాటం చేస్తూ, బీజేపీ బలోపేతానికి పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని, నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి విజయానంద రెడ్డి, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పార్టీలకతీతంగా పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546